క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక



ప్రభాకర్‌ను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: ఆమిద్యాల గ్రామానికి చెందిన టీడీపీ నేత పులగం ప్రభాకర్ వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అనంతపురంలోని తన స్వగృహంలో ప్రభాకర్‌కు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఆమిదాల తేజోనాథ్, రాకెట్ల అశోక్, వెంకటరెడ్డి, ఉదయ్‌రెడ్డి, రమేష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కూడేరు: ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులు నడుచుకోవాలని మండల మోడల్ ప్రవర్తనా నియమావళి అధికారి (ఎంసీసీ) ముస్తఫా కమల్ బాషా తెలియజేశారు. బుధవారం తన చాంబర్‌లో ఏపీఎం రాజశేఖర్, ఏపీఓ తులసీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఉద్యోగులు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వలంటీర్లు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకూడదన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారులు ఆదేశాలిచ్చినట్లు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

నేత్రపర్వంగా పూర్ణకుంభ రథోత్సవం



రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శెట్టూరు: బచ్చేహళ్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి పూర్ణకుంభ రథోత్సవం బుధవారం నేత్రపర్వంగా జరిగింది. ముఖ్య అతిథి ఎంపీ తలారి రంగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రథానికి గజమాల సమర్పించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని స్వామివారిని కోరుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు. గురువారం ఉదయం పూలరథోత్సవం నిర్వహించనున్నారు. సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ నరసింహులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, నాయకులు రాజశేఖర్, అనంతరెడ్డి, హరినాథరెడ్డి, తిప్పేస్వామి, ఎమ్మెస్ రాయుడు, అభిరామ్, సర్పంచ్ ఈరన్న, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేయండి

కణేకల్లు: 'అనావృష్టితో పంటలు పండక రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ యేడాది వడ్డీ కట్టించుకొని పంట రుణాలు రెన్యువల్ చేయాలి' అని కణేకల్లు మండల రైతు సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన ఆధ్వర్యంలో వివిధ గ్రామాల రైతులు బుధవారం బ్యాంకు మేనేజర్‌కు కలిసి వినతిపత్రం సమర్పించారు. స్టేట్ బ్యాంకు, సిండికేట్ బ్యాంకు, అనంత గ్రామీణ బ్యాంకులు వడ్డీ కట్టించుకొని పంట రుణాలు చేయనున్నాయని, యూనియన్ బ్యాంకులో కూడా వడ్డీ మాత్రమే కట్టించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కోరి నాగరాజు పాల్గొన్నారు.

లింగన్న కుటుంబానికి ఆర్థికసాయం



లింగన్నకు ఆర్థికసాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విడపనకల్లు: గుడిసె కాలిపోయి నిరాశ్రయులైన హరిజన లింగన్న కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే విశ్వ అండగా నిలిచారు. వివరాలు.. మండల పరిధిలోని గాజుల మల్లాపురంలో ఇటీవల హరిజన లింగన్నకు చెందిన గుడిసె విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. నిత్యావసర సరుకులు, బట్టలు నగదు, కాలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి దృష్టికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకెళ్లారు. స్పందించిన మాజీ ఎమ్మెల్యే వెంటనే లింగన్న కుటుంబానికి రు.47 వేలు ఆర్థికసాయం పంపించారు. బుధవారం జేసీఎస్ మండల కనీ్వనర్ భరత్‌రెడ్డి, శంకర్ గౌడు, షన్ముఖ గౌడు తదితరులు రు.47 వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డిష్ వెంకటేశులు, వన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాలవను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు



మెట్టు గోవిందరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కేపీ దొడ్డి టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో మెట్టు గోవిందరెడ్డి

- సమర్థుడినని చెప్పుకుంటున్న కాలవ గత ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయారో చెప్పాలి?
- ఆయన చేసిన ఇసుక, మట్టి దందాలు జనానికి తెలుసు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి

గుమ్మఘట్ట: సమర్థులు ఎవరు? అసమర్థలు ఎవరు? అన్నది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులుపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి విరుచుకుపడ్డారు. సమర్థుడనని చెప్పుకుంటున్న కాలవ... 2014 ఎన్నికల్లో ఎందుకు గెలవలేదో చెప్పాలని ప్రశ్నించారు. రాయదుర్గం పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెట్టు మాట్లాడారు. వలసపక్షి అయిన కాలవను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. 60 వేల మెజార్టీతో గెలుస్తానని బీరాలు పలుకుతున్న కాలవ శ్రీనివాసులు హాయిగా ఇంట్లో నిద్రపోవచ్చుగా అని చురకలంటించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అసమర్థ పాలన అందించడంతోనే గత ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ చిత్తు చిత్తుగా ఓడిపోయిందని విమర్శించారు. చంద్రబాబు తనయుడు లోకేష్ టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అడ్డదారిలో పదవులను అలంకరించి నేడు ఎలా పడితే అలా మాట్లాడితే ప్రజలు విశ్వసించరని ధ్వజమెత్తారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏనాడూ అక్రమాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. కాలవ చేసిన ఇసుక, మట్టి దందాలు రాయదుర్గం ప్రజలందరికీ తెలుసునన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే ప్రజలు పట్టంకడతారని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి ఖావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, బీసీ సెల్ శివకుమార్, వైస్ సర్పంచ్ రమేష్, బేలోడు రామాంజినేయులు, సుధాకర్‌రెడ్డి, రామచంద్ర, తిప్పేస్వామి, వెంకటంపల్లి శీన, చంద్రన్న, ఎర్రిస్వామి, రవి, కె.ఎం.రాజు, గొల్లరామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

గుమ్మఘట్ట మండలంలోని కేపీ దొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బోయ గురుస్వామి, బద్రిలింగప్ప వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని మెట్టు గోవిందరెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌనిలక్ష్మీకాంతారెడ్డి , సచివాలయాల మండల కన్వీనర్ రమేష్ ఆధ్వర్యంలో వారు చేరారు. వారికి కండువాలు వేసి మెట్టు గోవిందరెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

బలవంతంగా పార్టీ కండువా కప్పారు

డిన్నర్ ఉందని చెప్పి మంగళవారం రాయదుర్గం పట్టణానికి తీసుకెళ్లి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సమక్షంలో తమకు బలవంతంగా టీడీపీ కండువాలు వేశారని కేపీ దొడ్డి గ్రామానికి చెందిన గొల్లలింగప్ప, గొల్ల కెంచప్ప, హరిజన నగేష్, హరిజన భీమజ్జప్ప తెలిపారు. ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టి అందరినీ మభ్య పెట్టారన్నారు. బుధవారం మెట్టు సమక్షంలో వారు వైఎస్సార్సీపీ తీర్థం పుచ్చుకున్నారు. తమ ప్రాణం ఉన్నంత వరకు వైఎస్ జగన్‌తోనే నడుస్తామన్నారు.

బొమ్మనహాళ్ (డీ.హీరేహాళ్): రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం డి.హీరేహాళ్ మండలంలోని పులకుర్తి గ్రామంలో మెట్టు సమక్షంలో టీడీపీ పార్టీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పులకుర్తి గ్రామానికి చెందిన కాలవ తిప్పేస్వామి, కాలవ హనుమంతరెడ్డి, కాలవ తిప్పారెడ్డి, కాలవ దశరథరెడ్డి, కాలవ భీమరెడ్డి, కాలవ శివరామిరెడ్డి, గచ్చింటి దేవరెడ్డి, గచ్చింటి మల్లి, సిద్దంపల్లి వెంకట్‌రెడ్డి, హనుమంతరెడ్డి, ఏరేంగలి వీరారెడ్డి తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి, పార్టీ ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బోజరాజునాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, సీనియర్ నాయకులు మురడి మురళీమోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అంజిరెడ్డి, నాగిరెడ్డి, ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మురడి పద్మనాభరెడ్డి, రెహ్మతుల్లా, ఎర్రగుంట కేశవరెడ్డి, చంద్ర, దోణ్ణేప్ప, పరందామిరెడ్డి, మల్లి, శ్రీనివాసరెడ్డి, శివలింగప్ప, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య



పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి

కళ్యాణదుర్గం: సకల జన సంక్షేమం కాంక్షించే వైఎస్సార్‌సీపీని మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య కోరారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని 21, 22 వార్డుల్లో బుధవారం ఇంటింటికీ వెళ్లి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన మేలును వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం కోసం కుట్రలు, కుతంత్రాలు పన్నుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, ఎంపీపీ మారుతమ్మ, తాలూకా కురుబ సంఘం అధ్యక్షుడు దొణస్వామి, పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయంఫణి, కౌన్సిలర్లు లక్ష్మన్న, అర్చన, పరమేశ్వరప్ప, సీనియర్ నాయకులు సుధీర్, తిరుమల వెంకటేశులు, గోళ్ల సూరి, కో ఆప్షన్ అప్జల్, రేవన్న గౌడ్, పరంధామరెడ్డి, మల్లికార్జున, శ్రీకాంత్‌రెడ్డి, షేక్షావలి, బిక్కినాగలక్ష్మి, హేమ, నాయకులు శ్రీకాంత్, రాజు, రాము, హరి, బిక్కి హరి, జాకీర్, జోసెఫ్ కిషోర్, రామిరెడ్డి పాల్గొన్నారు.

కొత్తూరులో జన నీరాజనం

కళ్యాణదుర్గం మండలం కొత్తూరులో బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్యకు ఘన స్వాగతం లభించింది. సర్పంచ్ నాగమణి బాబు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూల వర్షం కురిపించారు. ప్రతి గడప వద్ద సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ.. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్, పాతలింగ, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, నియోజకవర్గ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి బుధవారం రాత్రి కళ్యాణదుర్గం పట్టణంలోని కుమ్మరవీధి, టీ సర్కిల్, అనంతపురం రోడ్డులో ఎన్నికల ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని అభ్యర్థించారు.

నేడు మున్సిపాలిటీలో ప్రచారం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య గురువారం కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 7 గంటలకు 24వ వార్డు బసవేశ్వరనగర్‌లో, సాయంత్రం 4 గంటలకు 20వ వార్డు మేదావీధిలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తారన్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



మాజీ ఎంపీటీసీ రఘును వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న తలారి రంగయ్య



పార్టీలోకి చేరిన మాజీ కౌన్సిలర్ డిష్ ప్రభాకర్, వాచ్ బాషాతో తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: పట్టణంలోని 21, 8వ వార్డుల్లో పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ మాజీ ఎంపీటీసీ బోయ రాఘవేంద్ర, ముక్తం కృష్ణవేణి, సాయి చైతన్య, సాయి వందన, శర్మస్, మసాల బాబు, పెద్ద పాలయ్య, చిన్న పాలయ్య, శైలమ్మ, దేవమ్మ, రిజ్వానమ్మ, గౌతమి, గంగమ్మ, జ్యోతి, గోపాల్‌తో పాటు మొత్తం 20 కుటుంబాల వారు ఉన్నారు. అలాగే టీడీపీ మాజీ కౌన్సిలర్ డిష్ ప్రభాకర్, వాచ్‌ల బాషా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఆయా కార్యక్రమాలలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జయంఫణి, పార్టీ అధికార ప్రతినిధి నారాయణపురం వెంకటేశులు, సీనియర్ నాయకులు సుధీర్, కిరీటి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

23న లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవం



అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. యేటా మాఘమాసంలో జరిగే ఈ ఉత్సవాలు ముందుగా మండలంలోని ఉద్దేహాళ్ వద్ద వేదావతి నదిలోనూ , అనంతరం ఉప్పరహాళ్ ఆలయం వద్దను జరుగుతాయి. రెండు గ్రామాల భక్తులు ఆనందోత్సాహంగా ఉత్సవాలను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకోగా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు.

తాటాకు బుట్టల్లో లక్ష్మీనరసింహస్వామి...

బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాళ్‌లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆకృతి లేకుండా తాటాకు బుట్టల్లో ఉండి భక్తులకు దర్శనమిస్తారు. వందలాది యేళ్ల నుంచి ఆచారంగా వజ్రకరూరు మండలం పందికుంటకు చెందిన భక్తులు యేటా నూతన తాటాకు బుట్టలను అల్లుకుని తెస్తారు. స్వామివారిని ఉప్పరహాళ్ నుంచి ఉద్దేహాళ్ వద్ద గల వేదావతి హగరి నదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెలిమిలో గురువులు పాత బుట్టల నుంచి కొత్త బుట్టలలోనికి రహస్యంగా మారుస్తారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఊరేగింపుగా సరిహద్దుదారి గుండా ఉప్పరహాళ్ దేవాలయానికి చేరుస్తారు. ఈ నేపథ్యంలో హగరి వద్ద , ఉప్పరహాళ్ దేవాలయం వద్ద స్వామి ఊరేగింపు సందర్భంగా అనేక మంది యువకులు , స్త్రీలు, రోగాల నయం కోసం, సంతానం కోసం కొర్కెలు తీర్చుకునేందుకు బోర్లా పడుకుంటారు. వారిపై స్వామివారు నడుచుకుంటూ ఆలయానికి చేరుకుంటారు.

వడదెబ్బతో ఎద్దు మృతి

గుత్తి రూరల్: కరిడికొండలో బుధవారం వడదెబ్బతో ఎద్దు మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు చిరంజీవి వ్యవసాయ పనుల నిమిత్తం రెండు కాడెద్దులను కొనుగోలు చేశాడు. అయితే తన రెండు కాడెద్దులను మంగళవారం రాత్రి ఇంటి ఆవరణలో కట్టి ఉంచాడు. బుధవారం వేకువజామున ఎద్దులకు మేత వేసేందుకు వెళ్లగా ఒక ఎద్దు నేలపై పడి ఉంది. గమనించిన రైతు వెంటనే ఎద్దును పరిశీలించగా అది మృతి చెందినట్లు గుర్తించాడు. ఎండతీవ్రతతో ఎద్దు మృతి చెందిందని, రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

తాతార్యారూఢ స్వామి తిరునాల ప్రారంభం



అలంకరణలో తాతార్యా రూఢస్వామి

గార్లదిన్నె: మర్తాడులో బుధవారం తాతార్యారూఢ స్వామి తిరునాల ప్రారంభమైంది. మొదటి రోజు వేద పండితుల నడుమ స్వా మి వారికి ధ్వజారోహణ, మహాన్యా సపూర్వక రుద్రాభిషేకం నిర్వహి ంచారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. గురువారం గంగపూజ, కలశ స్థాపన, రుద్రయజ్ఞం స్వామి వారికి ఆలయ ధర్మకర్త ఆదినారాయణ పట్టు వస్త్రాల సమర్పణ, సహస్ర బిల్వార్చన, రాత్రి 10 గంటలకు స్వామివారి పుష్ప రథోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

ముత్యాల పల్లకీలో మద్దానేశ్వరుడు



ముత్యాల పల్లకీలో ఊరేగుతున్న మద్దానేశ్వరుడు

రాయదుర్గం రూరల్: మద్దానేశ్వరుడు ముత్యాల పల్లకీలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో వెలసిన మద్దానేశ్వర స్వామి రథోత్సవం, పశువుల జాతరలో భాగంగా ముత్యాల పల్లకీ ఉత్సవం , లంకాదహన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ముత్యాల పల్లకీ రథంలో స్వామివారిని అత్యంత వైభవంగా ఊరేగించారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పల్లకీ ఉత్సవం అనంతరం లంకాదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు, సర్పంచ్ దురుగమ్మ, అన్నదాన కమిటీ అధ్యక్షుడు జయన్న, మహానందీశ్వర, ధరణేష్, కూల్ డ్రింక్ అప్పాజీ, గోవిందప్ప, ఉలుగప్ప, ఉప సర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఆయతపల్లి జనార్ధన, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గొరవయ్యల ఒగ్గుసేవ



గవిమఠం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒగ్గుసేవ చేస్తున్న గొరవయ్యలు

ఉరవకొండ: గవిమఠం బ్రహ్మోత్సవాల్లో భాగంగా కురుబ కులస్తుల ఆధ్వర్యంలో బుధవారం గొరవయ్యల ఒగ్గుసేవ, సంప్రదాయ నృత్యం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవిమఠం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్ర స్వామి హాజరయ్యారు. భక్తులు తెచ్చిన పాలు, పెరుగు, పండ్లు, దొనెలలో పోసి ఈ గిన్నెలను వరుసగా ఉంచారు. డమరుకం వాయిస్తూ తిరుగుతూ కుక్కల వలె అరుస్తూ పాలు తాగిన విధానం ఆకట్టుకుంది. ఒగ్గుసేవ తర్వాత దోనెలలో మిగిలిన పాలు, పెరుగు, పండ్లను శివ ప్రసాదంగా భావించి భక్తులు సేవించారు.

శుభకార్యం



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం రూరల్: మండలంలోని డి.కొండాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రామన్న యాదవ్ కుమార్తె శిరీష వివాహం మండలంలోని వద్రహొన్నూరు అపులాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం జరిగింది. ఈ వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



మాట్లాడుతున్న సీఐ శివరాముడు

కూడేరు: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ శివరాముడు కౌన్సెలింగ్ ఇచ్చారు. త్వరలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. సత్ప్రవర్తనతో మెలగుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకారమందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల వేలం

కళ్యాణదుర్గం రూరల్: మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలు, కార్లను బుధవారం వేలం వేసినట్లు సెబ్ సీఐ వెంకట్ తెలిపారు. మొత్తం 27 ద్విచక్రవాహనాలు, మూడు కార్లు వేలం వేయగా రూ.4,88,520 ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. వేలం పాటలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, కళ్యాణదుర్గం సెబ్ సీఐ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట



నీలగిరిస్వామి ఆలయంలో హోమం చేస్తున్న అర్చకులు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని కురుబ వీధిలో ఉన్న నీలగిరిస్వామి ఆలయంలో బుధవారం విగ్రహాల ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం విఘ్నేశ్వరుడు, పార్వతీ పరమేశ్వరులు, కుమార స్వామి, కాశీ అన్నపూర్ణేశ్వరీ దేవి, రేవణ సిద్దేశ్వర స్వామి, వీరభద్రస్వామి, లక్ష్మిదేవి, అభయాంజనేయ స్వామి, పెద్దమ్మ, గాదిలింగప్ప స్వామి, ఎల్లమ్మ దేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం రుద్రాభిషేకం, హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

'ఆర్డీటీపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి'

శెట్టూరు: పేదల పెన్నిధిగా నిలిచి సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే కక్షసాధింపు చర్యలు ఆపాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టైలర్ వన్నూరుస్వామి డిమాండ్ చేశారు. బుధవారం శెట్టూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదు దశాబ్దాలుగా పేదలకు విద్య, వైద్యం, మహిళాభ్యున్నతికి ఆర్డీటీ సంస్థ కృషి చేస్తోందన్నారు. ఆంక్షల పేరుతో సంస్థ కార్యకలాపాలకు ఆటంకం కలిగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గౌరయ్య, లక్ష్మణమూర్తి, బాబురావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

26 మంది విద్యార్థుల గైర్హాజరు

కూడేరు: పది పరీక్షల్లో భాగంగా బుధవారం ఇంగ్లిష్ పరీక్ష సజావుగా సాగింది. కూడేరు హైస్కూల్‌లో 242 మందికిగాను 17 మంది, కేజీబీవీలో 106 మందికి గాను 9 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు 26 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు మండల విద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా చీఫ్ అధికారులు దిలీప్ కుమార్, తిమ్మప్ప, డిపార్టమెంటల్ అధికారులు నరహరి, రాఘవేంద్ర చర్యలు చేపట్టారు.